Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 111
సంచిక : 232
పేజీలు : 3
బుధవారం, మే 06, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## అక్రమ ఇసుక రవాణాపై మెరుపుదాడులు



**టీ మీడియా, మే 5, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు మరియు టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లాలోని పలు మండలాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన అధికారులు, నది పరివాహక ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు.దాడుల సందర్భంగా అధికారులు పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో లారీలు, ట్రాక్టర్లు, జేసీబీలు ఉండగా, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. సంబంధిత వాహనాలకు అవసరమైన అనుమతులు, ఈ-వే బిల్లులు లేకపోవడంతో చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొంతమంది దళాలు రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా

3లో...

# నిరంతరం నీటి సరఫరాకు చర్యలు

### -జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**టీ మీడియా, మే5 , ఖమ్మం:** వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి త్రాగునీటి సరఫరాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయం ఉండాలని, ఫీల్డ్ స్థాయిలో అవసరమైన సమన్వయం చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పీక్ సమ్మర్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లోనే ఉండి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని, ఎంపీడీఓలు, ఎంపీఓలు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాసేవలో స్పందన అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్యలు కేవలం ఆర్డబ్ల్యూఎస్ శాఖకు మాత్రమే సంబంధించినవి కావని, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మే నెలలో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముండటంతో ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు, నష్టాలను వెంటనే పరిష్కరించాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. రోడ్డు పనుల సమయంలో పైప్‌లైన్ దెబ్బతిన్నట్లయితే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఖర్చు భరింపజేయాలని తెలిపారు.మండలాల వారీగా త్రాగునీటి పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, మొదట మిషన్ భగీరథ నీరు ప్రజలకు చేరేలా చూడాలని, తదుపరి స్థానిక వనరులను వినియోగించాలని, అవసరమైతే బోర్వెల్ ఏర్పాటు చేయాలని, చివరిగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని దశలవారీ చర్యలు సూచించారు.ఎత్తైన గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటినీ సరఫరా చేయాలని, సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన త్రాగునీటి నిధులను జెడ్పీ సీఈఓ సమన్వయంతో అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. సరఫరా లేని ఇళ్లను గుర్తించి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.వేసవి కాలంలో వీధి జంతువులు, చిన్న పక్షులు కూడా నీటి కొరతను ఎదుర్కొంటా యని, గ్రామాలు, మున్సిపాలిటీలలో స్థానిక సంస్థలు చిన్న, చిన్న నీటి గుంతలు (వాటర్ పిట్స్) ఏర్పాటు చేసి వాటికి తగినంత నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఒఆర్ఎస్ ప్యాకెట్లను పోలీస్ ఎస్‌హెచ్‌ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్‌స్ట్రోక్ బాధితుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, తగిన ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.లేబర్ శాఖతో సమన్వయం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కోచింగ్ సెంటర్లు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు బయట నిద్రించకుండా అవగాహన కల్పించాలని, మార్కెట్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజా ప్రదేశాల్లో త్రాగునీరు, ఒఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిపిఓ రాంబాబు, సిపిఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ, ఎస్ఈ పి.హెచ్., గ్రౌండ్ వాటర్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఏపిడిలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ వేదికగా సమస్యల పరిష్కారం



### -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**టి మీడియా , మే 5 , ఖమ్మం రూరల్:** ప్రజా సమస్యల దరఖాస్తులను ప్రజా దర్బార్ కార్యక్రమంలో నేరుగా స్వీకరించి న్యాయబద్ధమైన వాటిని పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారులను ప్రజల వద్దకు పంపి దరఖాస్తులు స్వీకరించామని, ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ లో 10 నుంచి 12 గ్రామాలు ఉండేలా చూసుకుని ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని తెలిపారు.గ్రామ సమస్యలు, ప్రజల వ్యక్తిగత సమస్యలు కూడా ప్రజా దర్బార్ కార్యక్రమంలో పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. 7 క్లస్టర్ పరిధిలో ఇప్పటి వరకు ప్రజల నుంచి పదివేల దరఖాస్తులు వచ్చాయని అన్నారు. 7 క్లస్టర్ పరిధిలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో 4500 నుంచి 5 వేల వరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తులు వచ్చాయని, 2 వేల దరఖాస్తులు భూ సమస్యలపై వచ్చాయని పేర్కొన్నారు. ధరణి పేరిట అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వీటిని మనం భూ భారతి ద్వారా పరిష్కరించామని, పెండింగ్ ఉన్న సాధా బైనామా దరఖాస్తులు అర్హత ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.8వ క్లస్టర్ పరిధిలో 9 గ్రామాలకు చెందిన ప్రజలను నేడు పిలవడం జరిగిందని ప్రతి ఒక్కరి నుంచి తానే స్వయంగా దరఖాస్తు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి దరఖాస్తు రికార్డ్ చేస్తామని అన్నారు. రాబోయే 35 రోజులలో సాదా బైనమా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తామని అన్నారు. సాదా బైనామాలో కొంత మంది ప్రభుత్వ భూములకు కూడా రిజిస్ట్రేషన్



చేయమని దరఖాస్తులు పెట్టారని, అటువంటివి ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబడవని అన్నారు. గ్రామాలలో ఇండ్లపై నుంచి వెళ్లే 11 కెవి, 33 కేవి విద్యుత్తు లైన్స్ మార్చడం జరిగిందని, ఇంకా ఎక్కడైనా ఇండ్లపై నుంచి ప్రమాదకరంగా విద్యుత్తు లైన్లు వెళితే వాటిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన నూతన విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అందేలా చూస్తామని అన్నారు. పేదలు అందించిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తుకు మూడు నెలల్లోగా పరిష్కారం చూపుతామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు అండగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని అన్నారు. పేదలు, మహిళలు, నిరుద్యోగ యువత పక్షాన ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పదేళ్ల పాలనలో పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన సొమ్ము అప్పటి ప్రభుత్వం దోపిడి చేసిందని మంత్రి

మిగతా 3లో






## ఖమ్మం సమీపంలో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు గాయాలు

**టి మీడియా , మే 5 ,ఖమ్మం, :** ఖమ్మం జిల్లా పరిధిలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒక బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ఘటన ఖమ్మం--సత్తుపల్లి రహదారిపై జరిగినట్లు స్థానికులు తెలిపారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తమ గమ్యస్థానానికి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన లారీ అదుపు తప్పి వారిని ఢీకొట్టింది.

ఇద్దరికీ గాయాలు తీవ్రంగా అయ్యాయిస్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు.గాయపడిన వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుప్రస్తుతం బాధితులు చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకునికేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్‌పై విచారణ ప్రారంభించారు.ప్రమాదానికి గల కారణాలు (అతి వేగం / నిర్లక్ష్య డ్రైవింగ్) పరిశీలిస్తున్నారు.



## మహబూబాబాద్ జిల్లాలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

**టి మీడియా , మే 5 , బయ్యారం :** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సందర్శించారు. స్థానికల వద్ద నుంచి వివరాలు సేకరించారు. అయితే గత రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోట పోటీగా అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు చేయగా ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకోగా కొన్ని రోజులపాటు విగ్రహాల ఆవిష్కరణ వాయిదా పడింది.అనంతరం వేరువేరుగా రెండు విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించిన అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బలగాలు గ్రామానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఖమ్మం జిల్లాలో రోడ్ల దుస్థితి

### - ప్రజల ఆందోళన



**టి మీడియా , మే 5 , ఖమ్మం:**జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు మండలాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా బూర్గంపహాడ్, ముదిగొండ, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో గ్రామీణ రహదారులు గుంతలతో నిండిపోయి ప్రయాణం కష్టమైంది.గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో రహదారులు కనిపించకుండా పోయాయి. వాహనదారులు, ముఖ్యంగా బైక్ రైడర్లు తరచూ జారి పడే ప్రమాదం ఉంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడంలో, రైతులు తమ పనులకు వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొన్ని గ్రామాల్లో అంబులెన్స్ కూడా చేరలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు చెబుతున్నదేమిటంటే, చాలా కాలంగా రోడ్లకు సరైన మరమ్మతులు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తెలిపారు.వెంటనే గుంతలు పూడ్చి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలికంగా అయినా గ్రావెల్ వేసి ప్రయాణానికి అనుకూలంగా చేయాలని కోరుతున్నారు.



# ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులు

### -జిల్లా కలెక్టర్ అంకిత్

**టి మీడియా , మే 5 , భద్రాద్రి కొత్తగూడెం :**జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపులు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, అలాగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపడుతున్న పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండలో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించి, ప్రతి విద్యార్థి ఈ క్యాంపులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మే 13 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి హాజరు మరియు అభ్యాస పురోగతిపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం కూడా సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని, మండలాలు మరియు పాఠశాలల వారీగా ఫెయిల్ విద్యార్థుల వివరాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్యాంపుల ద్వారా విద్యార్థుల లోపాలను గుర్తించి, లక్ష్యబద్ధంగా బోధన చేపట్టి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని పాఠశాలల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు 100 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 12 నుండి విద్యాశాఖ ద్వారా చేపట్టబడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అధికారులు తమ మండలాల్లో చేపడుతున్న చర్యలపై వివరాలు తెలియజేయగా, కలెక్టర్ తగిన సూచనలు చేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం దిశగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.




# పామాయిల్ సాగుద్వార దీర్ఘకాల నికరాదాయం

- వ్యవసాయ శాఖ- ఉద్యాన శాఖ రైతు సదస్సులో శాస్త్ర వేత్తలు

**టి మీడియా , మే 5 ,వైరా**

పామాయిల్ సాగు ద్వార దీర్ఘకాల నికరాదాయంతో పాటు అంతర పంటల సాగు ద్వారా అదనపు లాభాలు గడించవచ్చునని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మంగళవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం రైతు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల సందర్భంగా వ్యవసాయ శాఖ -ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రైతు సదస్సు నిర్వహించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల ప్రాధాన్యం, ఆదాయ వృద్ధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఉద్యాన పంటల సాగు విస్తరణ, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, అలాగే వరి, పత్తి, మిరప, మొక్కజొన్న వంటి సాంప్రదాయక పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక లాభదాయకమైన పంటలపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం సాధ్యమవుతుందని, అంతర పంటల ద్వారా అదనపు లాభాలు పొందవచ్చని అధికారులు వివరించారు.

వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్తలు పావని, ఫణిశ్రీ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలోని వాతావరణం, నేలల పరిస్థితులు ఆయిల్ పామ్, మల్బరీ సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున ఈ పంటలను సాగు చేసి లాభాలను పొందాలని కోరారు.




ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సహాయం, మార్కెటింగ్ మద్దతును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ, సాంప్రదాయక పంటలపై ఆధారపడటం వల్ల రైతుల ఆదాయం పరిమితమవుతోందని, కాబట్టి ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పు దినుసులు, నూనె గింజల పంటల సాగు వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పంటలు మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగి ఉండటంతో పాటు అధిక లాభాలను అందిస్తాయని ఆమె తెలిపారు.

వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి పంటలు ఒకసారి నాటిన తరువాత 30 నుండి 40 సంవత్సరాల వరకు స్థిరమైన దిగుబడిని ఇస్తాయని, ఇది రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరామ్ నాయక్, పట్టు పరిశ్రమ అధికారి డీడీ ముత్యాలు, వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణ శ్రీ, వైరా, ఎన్కూర్, సింగరేణి మండల వ్యవసాయ అధికారులు మాయన్ మంజూఖాన్, నరసింహ రావు, బి.అశోక్, ఉద్యాన శాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారులు, సపవత్ సైదులు, మెడ రాజేష్ వాసంతి, వెంకట నర్సయ్య, కీర్తి, సింగరేణి వ్యవసాయ విస్తరణ అధికారులు ఉద్యాన క్షేత్ర సిబ్బంది, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ కార్యాలయాల్లో ఆర్టీఐ అమలు ఎక్కడ?

### బోర్డులు లేక ప్రజలకు ఇబ్బందులు

**టీ మీడియా, మే 05, సింగరేణి (కారేపల్లి):**ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమాచార హక్కు చట్టం 2005 (ఆర్టీఐ) విద్యుత్ శాఖ కార్యాలయాల్లో సరైన విధంగా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ కార్యాలయాల్లో ఆర్టీఐకి సంబంధించిన సమాచారం బోర్డులు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ , అప్పీలేట్ అథారిటీ వివరాలు, దరఖాస్తు విధానం వంటి సమాచారం స్పష్టంగా బోర్డు రూపంలో ప్రదర్శించడం తప్పనిసరి.అయితే, విద్యుత్ శాఖకు చెందిన కొన్ని కార్యాలయాల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో ప్రజలు తమకు అవసరమైన సమాచారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు విద్యుత్ బిల్లులు, కొత్త కనెక్షన్లు, పనులు, ఫిర్యాదులపై సమాచారం పొందడానికి ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించుకోవచ్చు. కానీ కార్యాలయాల్లో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో అవగాహన లోపం కనిపిస్తోంది.




### అధికారుల స్పందన అవసరం

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అన్ని కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పారదర్శక పరిపాలన కోసం ఆర్టీఐ అమలు తప్పనిసరి అని పేర్కొన్నారు.



# ఆదర్శ నేత భూక్య బావుసింగ్‌కు నివాళి

**నానునగర్ తండాలో వర్ధంతి సభ నిర్వహణ**

**టీ మీడియా, మే 5 , సింగరేణి (కారేపల్లి):**పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడినకమ్యూనిస్టు నేతభూక్యబావుసిం గ్కుసిపిఎంనాయకులునివాళులర్పించారు. నానునగర్ తండాలో ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభకు మండల కమిటీ సభ్యుడు యనమనగండ్ల రవిబాబు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర మాట్లాడుతూ, భూక్య బావుసింగ్ ప్రజా సమస్యలపై చివరి వరకు పోరాడిన నిజమైన ప్రజానాయకుడని పేర్కొన్నారు. ఆయన పోరాటస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. చీమలపాడు ప్రాంతంలో ఏలూరు లక్ష్మీనారాయణ నాయకత్వంలో జరిగిన ఉద్యమాల్లో బావుసింగ్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై స్పందిస్తూ, కార్మికులు మరియు రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అలాగే, సీతారామ ప్రాజెక్టు నీటిని కారేపల్లి మండలానికి అందించే వరకు పోరాటాలు కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడు వజ్జా రామారావు భూక్య బావుసింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సభలో పార్టీ నాయకులు వల్లబోయిన కొండలరావు, అజ్మీర శోభన్ బాబు, శాఖ కార్యదర్శులు సురభాక సర్వయ్య, బానోత్ కిషన్, సీనియర్ నాయకుడు మన్నెం బ్రహ్మయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, అలాగే కుటుంబ సభ్యులు హరిచంద్, హుస్సేన్, రాచర్ల రణధీర్ పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వితరణ

**టీ మీడియా ,మే 5 ,కూసుమంచి:**జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పుత్రులు పుత్రిక వితరణ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన భార్య భర్తలు గోపె గోడమ్మ గోపి వెంకయ్య స్వర్గస్తులైనారు. వారి జ్ఞాపకార్థం కుమారులు గోపి ఉప్పయ్య (ఉపేందర్) గోపి లక్ష్మీనారాయణ, కుమార్తె ఏపూరి లక్ష్మీ రాంబాబు లు వితరణ చేశారు. ఆసుపత్రిలో రోగులకి ఉపయోగించు 30 వేల రూపాయల విలువ గల వస్తు సామాగ్రిని చేగువేరా భూపతి ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు చైర్మన్ గద్దెల చంద్రశేఖర్ చందు ఆగస్తిన్ కు వారు అందజేశారు. ఆసుపత్రులు రోగులకు ఉపయోగించు ఎడ్జస్ట్ మెంట్ బెడ్)పరుపు ఎయిర్ బ్యాగ్ వీల్ చైర్ లను,, గోపి ఉప్పయ్య గోపాల లక్ష్మీనారాయణ ఏపూరి లక్ష్మీ రాంబాబు లు వితరణగా అందజేశారు కీర్తిశేషులు గోపి బోడమ్మ చిత్రపటానికి ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు గోపి బోడమ్మ వెంకయ్య జ్ఞాపకార్థం కుమారులు కుమార్తె అందించిన ఆసుపత్రి వస్తు సామాగ్రిని తమ ఫౌండేషన్ ద్వారా నిరుపేద రోగులకి అందించి సహాయపడతామని చెప్పారు. ఈ సామగ్రిని తన ఫౌండేషన్కు అందించినందుకు గోపి ఉప్పయ్య లక్ష్మీనారాయణ లక్ష్మీ రాంబాబులకు చైర్మన్ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీర్తిశేషులుగోపి బోడమ్మ వెంకయ్య మనవళ్ళు ఏపూరి రాకేష్ ఏపూరి అనీలు సంపంగి గోపి మాతంగి వెంకటేశు చెరుకుపల్లి చక్రి రావిండ్ల నాగరాజు తో పాటు గోపి రామకృష్ణ గోపి ఉప్పయ్య గోపి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి రెండు మూగజీవాలు బలి

**- కన్నీరుమున్నీరవుతున్న రైతులు**
**- రూ.1.5 లక్షల మేర నష్టం**

**టీ మీడియా ,మే 5 , జూలూరుపాడు :** ఆరుగాలం శ్రమించి, కన్నబిడ్డల్లా సాదుకున్న పాడి పశువులను విద్యుత్ రూపంలో మృత్యువు కబళించింది. ఆ ఇద్దరు రైతుల జీవనాధారం తెగిపడిన విద్యుత్ తీగల రూపంలో చితికిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం రాజారావుపేట గ్రామంలో మంగళవారం వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ?రాజారావుపేట గ్రామానికి చెందిన రైతులు ముళ్లపాటి దుర్గయ్య, పొన్నెబోయిన నరేష్‌కు చెందిన రెండు తెల్ల పశువులు సోమవారం ఉదయం మేత కోసం శివారు పొలాల్లోకి వెళ్లాయి. అయితే, గ్రామ సమీపంలోని ఓ పొలంలో విద్యుత్ ఇన్సులేటర్ తెగిపోయి, హైటెన్షన్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి.మేత మేస్తూ అటుగా వెళ్లిన పశువులు ఆ తీగలను తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన పశువుల విలువ సుమారు రూ.1.5 లక్షల వరకు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా వేలాడుతున్న తీగలకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా బాధిత రైతులు వేడుకొంటున్నారు.





# సహకార సంఘం చైర్మన్‌గా పాండు రంగారావు

**టీ మీడియా ,మే 5 , జూలూరుపాడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా కొమ్మినేని పాండురంగారావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు ఇప్పటి వరకు పర్సనల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన శ్రీనివాసరావు నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్లు చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆకాంక్షించారు.సహకార సంఘం ద్వారా రైతులకు అందించే సేవలను మరింత చేరువ చేస్తామని, ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికి సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా ముందస్తు ప్రణాళికలతో పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నరసింహారావుతో పాటు డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, చాపలమడుగు రామ్మూర్తి, హేమ్లా, రెడ్డిబోయిన రాము, పాపిన్ని వెంకయ్య, తిరువెంగళరావు, శిరంశెట్టి రామారావు, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కోసం డబ్బులు వసూలు.. డ్రైవర్ అరెస్ట్



**టి మీడియా , మే 5 , బూర్గంపహాడ్ :** బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఖదీర్ కోసం డబ్బులు వసూలు ఆయన ప్రైవేట్ డ్రైవర్ ఫహీంను ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ మంగళవారం ఖమ్మం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఖదీర్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఏసీబీకి సైతం పలు ఫిర్యాదులు రావడంతో గత ఏడాది జూన్‌లో ఏసీబీ అధికారులు కార్యాలయంలో దాడులు చేసి తనిఖీలు నిర్వహించి ఫోన్ పే ద్వారా నగదు బదిలీ జరిగినట్లు గుర్తించడంతో పాటు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ భద్రాచలానికి బదిలీ కావడంతో సంఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే అతడిని కూడా ఏసీబీ అధికారులు పట్టుకుని ఏసీబీ కోర్టుకు తరలించారు.అయితే బూర్గంపహాడ్‌లో జూన్‌లో జరిగిన ఏసీబీ దాడుల్లో సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ డ్రైవర్‌కు సంబంధించిన కేసును విచారణ చేపట్టిన అధికారులు ఫోన్ పే ద్వారా నగదు బదిలీలు జరిగిన విషయాన్ని ధృవీకరించి తాజాగా ఖమ్మంలో డ్రైవర్ ఫహీంను అరెస్ట్ చేసి ఖమ్మం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఫహీం ముందుగా తన ఖాతాలో నగదు బదిలీ చేయించుకుని ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చేవాడని విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏ అధికారైనా లంచం అడిగితే ఏసీబీ దృష్టికి తీసుకురావాలని, అలాంటి అవినీతి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## అక్రమ ఇసుక

తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీనిపై నిఘా పెంచిన టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలు రాత్రి వేళల్లో ఆకస్మిక దాడులు నిర్వహించడంతో ఈ అక్రమ రవాణా బండారం బయటపడింది.అధికారులు స్పష్టం చేసినదేమిటంటే, అక్రమ ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని, నదుల పరవళ్లు మారే ప్రమాదం ఉందని చెప్పారు. అలాగే ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీ నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు హెచ్చరిక జారీ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం లేదా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు, ముఖ్యంగా రాత్రి వేళల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు కొనసాగుతున్నాయి.

# వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల అరెస్ట్

**టి మీడియా , మే 5 , పెనుబల్లి**

వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను బుధవారం వి.యం బంజర పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టుకు రిమాండ్ చేశారు. రూరల్ సీఐ ముత్తిలింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని కొందరు వ్యక్తులు ఆసరాగా తీసుకొని అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ.. ధనార్జనే లక్ష్యంగా వ్యవస్థీకృత నేరాలు పాల్పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ముగ్గురు నిందుతులను అదుపులోకి తీసుకోని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. గత నెల 25న వియం బంజర ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో కలిసి వియం బంజర రింగ్ సెంటర్ నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరువూరు వైపు నుండి వస్తున్న ఒక టిప్పర్ లారీ నెంబర్ AP39WB0396ను గమనించి తనఖీ చేసి ఇసుకలోడును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా మూలాలపై దృష్టి పెట్టి పరారీలో వున్న అసలైన నిందితులను మంగళవారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇదే లారీపై నిందితులపై గతంలో వియం బంజర పోలీస్ స్టేషన్లో 203/2025 U-s 318(4) BNS కేసు నమోదు అయినట్లు తెలిపారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాకు చెందిన పసుపులేటి పవన్ కుమార్ (టిప్పర్ డ్రైవర్), వెల్లంకి త్రినాథ రామకృష్ణ (టిప్పర్ ఓనర్), అబ్బూరి రఘు (మధ్యవర్తి)లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. కల్లూరు డివిజన్లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ఎలాంటి అక్రమ రవాణాకు ఆస్కారం లేదని పోలీస్ తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. ధనార్ధన లక్ష్యంగా ఇలాంటి వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

## ప్రజా దర్బార్ వేదికగా సమస్యల పరిష్కారం

విమర్శించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు 8వ క్లస్టర్ లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించు కుంటున్నామని అన్నారు. 7 విడతల్లో దాదాపు పది వేల దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయని, వీటిలో అర్హత ఉన్న దరఖాస్తులు పరిశీలించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసిల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.